క్లుప్తంగా

రేపు సట్టు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న సట్టు పోలేరమ్మతల్లి రెండో వార్షిక తిరునాళ్ల శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల వేడుకల్లో భాగంగా అమ్మవారి అలంకరణ రాత్రికి వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

25న ఉద్యోగ మేళా

చీరాల: చీరాలలోని గౌతమి డిగ్రీ కాలేజీలో ఆదివారం చీరాల, బాపట్ల పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులకు బాసటగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలే లక్ష్యంగా శ్రీగౌతమి కాలేజి, ఎస్ఎస్‌సి అకాడెమీ సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు వారి వివరాలను రిజిస్ట్రేషన్ లింక్, క్యూర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చని గౌతమి డిగ్రీ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ ఎంసిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. జాబ్‌మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90591 391437, 79898 15997 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

26న పురపాలక సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ పురపాలక సంఘ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ హాలులో ఈనెల 26 ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ ఎల్ ఏస్తేరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కమిటి సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

కొప్పెరపాలెంలో ఆర్బీకే ప్రారంభం నేడు

బల్లికురవ: మండలంలోని కొప్పెరపాలెంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రూ. 22 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చింతల పేరయ్య గురువారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హజరవుతారని చెప్పారు. వ్యవసాయ శాఖ మండలస్థాయి అధికారులు గ్రామాల వారీగా ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.

ఘనంగా యోగాడే



అక్కయ్యను సన్మానిస్తున్న సభ్యులు

అద్దంకి: పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి సెంటర్‌లో గురువారం యోగా డే, మమ్మాడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం బీకే రామలక్ష్మి, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా యోగాసనాల ప్రయోజనాల గురించి రామలక్ష్మి వివరిస్తూ మనుసును తేలికపరచే విధంగా ఆసనాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. అలాగే మనసుల్లో సత్వ గుణాన్ని పెంచే విధంగా, పాజిటివ్ థింకింగ్ కలిగే విధంగా ఆసనాలు, యోగా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ ఉమా అన్నపూర్ణ, గ్రంధి లక్ష్మి నాగరాజకుమారి, జ్యోతి అక్కయ్య, చెరుకూరి శ్రీదేవి, అంజన, హనుమాయమ్మ పాల్గొన్నారు.

పంచాయతీలో రెండు సూపర్ వైజర్ పోస్టులు

మార్టూరు: మార్టూరు పంచాయతీ కార్యాలయ పరిధిలో రెండు సూపర్ వైజర్ పోస్టులు కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్య నిర్వాహణ, మొక్కల పెంపకం కోసం ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ చదివిన వారు కానీ, స్వచ్ఛంద సంస్థల్లో అనుభవం పొందిన వారు కానీ ఈ నెల 28వ తేదీలోపు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎంపిక అయిన అభ్యర్థులకు మొదటి మూడు నెలలు రూ.12 వేలు వేతనం అనంతరం ఆకర్షణీయమైన జీతం ఇస్తారని చెప్పారు.

క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం

తర్లుపాడు: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని హెచ్ఎం సుధాకర్ పేర్కొన్నారు. గురువారం తర్లుపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీ నిర్వహించారు. చెన్నారెడ్డిపల్లి పాఠశాలకు చెందిన కుందురు కీర్తి, కలుజువ్వలపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన యక్కంటి హేమ, అద్దంకి శైలజ, మీర్జాపేట జెడ్పీ పాఠశాలకు చెందిన స్రవంతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.250 చొప్పున తర్లుపాడు ఎస్‌బీఐ మేనేజర్ దేవరకొండ బాబు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటి మోహన్, జి.సుజాత, రామారావు, రమేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



స్వర్ణలో ఏఎన్ఎం పనితీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

పర్చూరు (చినగంజాం): సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సంధ్యశ్రీ సూచించారు. మండలంలోని చెరుకూరు 1 గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్‌లతో సమావేశం నిర్వహించారు. సచివాలయంలో అందిస్తున్న సేవలు, నిర్వాహణ విధానం, రికార్డులు పరిశీలించారు. జగనన్న సురక్ష పథకం అమలు చేయుటకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సిబ్బందికి, వలంటీర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, అంగన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల: విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా ప్రజల్లో సచివాలయ ఉద్యోగుల మీద మంచి అభిప్రాయం వ్యక్తం చేసేలా పనిచేయాలని తహసీల్దార్ జీ.ప్రభాకరరావు అన్నారు. గురువారం మండలంలోని ఈపూరుపాలెం గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ప్రతిరోజు డ్యాష్‌బోర్డు చూసుకొని పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో ఏ ఒక్కరికీ రక్తహీనత సమస్యలు ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండలంలోని స్వర్ణ-1 గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న సిబ్బంది పనితీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఖాశీం, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలి..

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు పౌర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు బాద్యతలు గుర్తెరిగి పనిచేయాలని తహశీల్దార్ కే రవిబాబు కోరారు. గురువారం పెద అంబడిపూడి సచివాలయాన్ని ఆయన తనికీ చేశారు. హాజరు, మూమెంట్, స్పందన, రిజిష్టర్లను పరిశీలించారు. తనిఖీల్లో డీటీ రవికుమార్ పాల్గొన్నారు.



చెరుకూరు సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న తహశీల్దార్ సంధ్యశ్రీ



చీరాల: సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్



లబ్ధిదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

● గడప గడపలో.. ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం నక్కబొక్కలపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తెలుసుకున్నారు. షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో గ్రామ పంచాయితీ సాధారణ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సైడు కాలువలు, కల్వర్టులు, సీసీ రోడ్లను చైతన్య లాంఛనంగా ప్రారంభించారు. ప్రజా సంకల్పయాత్రలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు జగనన్నకు వస్తున్న ప్రజాదరణను చూసి చూడలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని రెండోసారి జగనన్న సీఎం కావాలని కోరుకుంటున్నారంటే ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని తెలుసుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో మండల కన్వీనర్ బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, కె రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవోఆర్డీ సుమతి, గ్రామ పంచాయితీ సెక్రటరీ జీ. సీతామహాలక్ష్మి, పీఆర్ ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, గిరినాయక్, దుర్గా రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర సుభిక్షం కోసం విరాటపర్వ పారాయణం



విరాటపర్వ పారాయణం చేస్తున్న రామకృష్ణమూర్తి

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు విరాటపర్వ పారాయణం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో పడి, పంటలు బాగా పండాలని కోరుతూ పారాయణాన్ని చేస్తున్నట్లు రామకృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ వర్షాలు వెనక్కు తగ్గి ఇబ్బందులు పడుతున్న తరుణంలో పూర్వ కాలంలో విరాటపర్వంలో పారాయణ చేస్తుండేవారని చెప్పారు. ఈఏడాది వర్షాలు కొంచెం వెనక్కు తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర సుభిక్షత కోసం ఈ పారాయణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన క్రీడా మైదానం



నల్లమట్టితో పేరుకుపోయిన క్రీడా మైదానం

చీరాల రూరల్: స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ క్రీడామైదానం బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షానికి చిత్తడి చిత్తడిగా మారిపోయింది. హైస్కూలు వెనుక వాకర్లు, క్రీడాకారులు వ్యాయామాలు చేసుకునే చోట నల్లమట్టి దిబ్బలు ఉండడంతో భారీ వర్షానికి నల్లమట్టి మొత్తం కారిపోయింది. దీంతో మైదానం రెండు అంగుళాలతో నల్లమట్టి పేరుకుపోయింది. మైదానంలో కాలుపెడితే జర్రున జారి కిందపడిపోయే ప్రమాదం ఉంది. దీంతో క్రీడాకారులు, వాకర్లు వ్యాయామాలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైస్కూలు వెనుక భాగంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పచ్చదనం ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు ఐదు నెలల క్రితం 14 వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలు కేటాయించారు. పనులు కూడా మొదలు పెట్టారు. అయితే కొన్ని అనివార్య కారణాల వలన పనులలో కొంత జాప్యం జరిగాయి. అయితే నాలుగు రోజులుగా మున్సిపల్ అధికారులు మరలా పనులు ప్రారంభించారు. గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు ట్రాక్టర్లతో నల్ల మట్టిని తోలుతున్నారు. పనులను త్వరగా పూర్తిచేసి క్రీడా మైదానంలో ఇబ్బందులు తొలగించాలని క్రీడాకారులు, పాదచారులు కోరుతున్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరంచ, ఉత్తరాయణం ఆషాఢ మాసం, మాఘ నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జీఎస్టీ నిబంధనలు సడలింపు

చీరాల: నేతన్న నేస్తం పథకం అమలుకు సంబంధించి నిబంధనలు సడిలించినట్లు దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర గురువారం తెలిపారు. నేతన్న నేస్తం పథకం అమలుకు సంబంధించి నిబంధనలు గురించి చేనేత, జౌళి శాఖ అధికారులతో మాట్లాడి జీఎస్టీ బిల్లులు, ధ్రువీకరణ పత్రాలు నిబంధనలు సడలించాలని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నేతన్న నేస్తం అందే విధంగా చూస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహిస్తారని ఎంపీడీవో సురేష్బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎండీవో కోరారు.

28న సంతమాగులూరులో..

సంతమాగులూరు (అద్దంకి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సెక్రటరీలు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి జగనన్న సురక్ష పథకం

కారంచేడు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు శుక్రవారం ఎంపీడీవో డీ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు యార్లగడ్డ సుబ్బారావు, ఐనంపూడి వనజలు హాజరవుతారన్నారు.

జగనన్న సురక్ష పథకంపై సమీక్ష..

చీరాల: నేటి నుంచి ప్రారంభించనున్న జగనన్న సురక్ష పథకంపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఎస్కే అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంపై జులై 1వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించేందుకు రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీమ్-1లో తహసీల్దార్, ఈవోఆర్డీ, టీమ్-2లో ఎంపీడీఓ, డిటీ సచివాలయాల వారీగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్దిదారుల్లో ఎవరికైనా ప్రభుత్వం అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన 9 రకాల సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు మొత్తం 11 సర్వీసులు ఏదైనా అందకుంటే ఆ సచివాలయంలో నిర్వహించే క్యాంపులో అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, డిటీ సురేష్, ఈఓఆర్డీ బి.మురళీబాపూజీ, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రతిభామూర్తుల కార్యక్రమం

అద్దంకి: పట్టణంలోని చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవాసదన్‌లో ఈ నెల 24న సాయంత్రం 6.30 గంటలకు ప్రతిభామూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీసీహెచ్ కోటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో డొక్కా సీతమ్మను గురించి ప్రముఖ పద్యకవి డీవీఎం సత్యనారాయణ, గాయకుడు ఎస్పీ బాలు గురించి వచన కవి చందలూరినారాయణరావు ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

24న విద్యుత్ వినియోగదారులకు అదాలత్..

అద్దంకి రూరల్: ఈనెల 24 తేదీన అద్దంకి డివిజన్ పరిధిలోని అద్దంకి అర్బన్, 7 మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగ దారులకు స్థానిక విద్యుత్ భవన్‌లో అదాలత్ నిర్వహించనున్నట్లు అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు గురువారం తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్ విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యుడు కె. వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఎం రామదాస్, స్వతంత్ర సభ్యుడు ఎ. సునీత హాజరవుతారు కావునా విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలపాలన్నారు.

ప్రతి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



బొబ్బేపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ కేవీ శ్రీనివాసరావు



రావినూతలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మార్టూరు: అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు అందజేస్తామని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొబ్బేపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామ రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట సాగు హక్కు పత్రాల వలన అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో ఎదురయ్యే సమస్యల వలన ప్రభుత్వం అందించే పంటల బీమా, తదితర పథకాల ప్రయోజనాలు పొందవచ్చు అని తెలిపారు. ఏవో వీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు ప్రతి గ్రామంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంలో రైతులు పంట సాగు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, 11 నెలల కాల వ్యవధి మాత్రమే ఉండే కౌలు రైతు కార్డుల వలన భూ యజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు కౌలు రైతులకు సహకరించాలని కోరారు.

వేటపాలెంలో..

వేటపాలెం: అర్హులైన ప్రతి ఒక్క కౌలు రైతుకు సీసీఆర్‌సీ (కౌలు గుర్తింపు కార్డులు) అందిస్తామని ఏవో ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని దేశాయిపేట భరోసా కేంద్రం వద్ద సీసీఆర్‌సీపై రైతులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందిన రైతులు పొలం యజమాని ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నవ్యవాణి, శివారెడ్డి, రిజ్వాన, పర్వీన్, కే మనీషా, ఎం శిరిష పాల్గొన్నారు.

మేదరమెట్ల: కౌలు చేసుకునే ప్రతి కౌలు రైతు పంట సాగు హక్కు పత్రాలను పొందాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. కొరిశపాడు మండలంలోని రావినూతలలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

● లెప్రసీ నివారణాధికారి డాక్టర్ సురేష్‌కుమార్

మార్కాపురం టౌన్: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు పక్కగా సర్వే చేపట్టనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్‌లు, నోడల్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని అరవింద ఘోష్ పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి నిర్ధారణ పరీక్షలకు డాక్టర్ వద్దకు పంపాలని చెప్పారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే భయపడాల్సిన పనిలేదని, వ్యాధి తీవ్రతను బట్టి 6 నుంచి 12 నెలలు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని డీఐఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ డాక్టర్లు, లెప్రసీ నోడల్ అధికారులు, ఆశ నోడల్ అధికారుల, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో ఫీజుల మోతపై ఫిర్యాదు

మార్కాపురం: డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని బహుజన సైన్యం అధ్యక్షుడు నాగయ్య సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు గురువారం వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుధంగా 40 వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు చెల్లించిన తలిదండ్రులకు రసీదులు కూడా ఇవ్వడం లేదని వివరించారు. అధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నోటీసు బోర్డుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల పట్టికను ఏర్పాటు చేసేలా ఆదేశించాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, తిమోతి, సుబ్బయ్య, చిన్నబాబు, జోషఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈవో రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పుస్తకాలు, యూనిఫాం, డొనేషన్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కనీస వసతులు లేని ప్రైవేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు పవన్, నారాయణ, సందీప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కండువాలు కప్పుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పది కుటుంబాలు గురువారం రాత్రి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండలంలోని నక్కబొక్కలపాడులో సన్నెబోయిన సాంబశివరావు ఆధ్వర్యంలో ఏటి వీరయ్య, కొండలు, గోపికృష్ణ, కన్నెబొయిన గంగాధర్, సంపతి వీరరాఘవులు, రోశయ్య, ఏటి నాగేంద్రబాబు, రామకృష్ణ, వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి చైతన్య పార్టీ కండవాలు కప్పి స్వాగతం పలుకుతూ జగనన్న విజయానికి కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి భూమి కేటాయింపు



రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చీరాల: యడం చినరోశయ్య ట్రస్టు ఆధ్వర్యంలో చీరాల ప్రాంతంలో సేవలు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆక్సిజన్ మిషన్లు అందిస్తుండగా ఆపదలో ఉన్నవారికి ఆర్థి సాయాన్ని అందిస్తున్నారు. ట్రస్టు సేవలను విస్తృతపరిచే కార్యక్రమంలో భాగంగా గురువారం దండుబాటలోని కోటయ్య అనాథాశ్రమానికి రూ.3 లక్షలు విలువ చేసే భూమిని కొనుగోలు చేసి ఇచ్చారు. ట్రస్టు నిర్వాహకులు గోపాలం దీపక్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు తామెప్పుడు అండగా ఉంటామన్నారు.